# నాకు నచ్చిన నా కథ



టి. ఇందిరా చిరంజీవి

ఇది తరుణ ఘోష పత్రికలో ప్రచురితమైనది.

నేను వ్యాసాలు, కథానికలు, నాటికలు యాభై పైగా వ్రాసాను. సముద్రం లాంటి ఈ రచనా యుగంలో నేను చేసిన రచనలు చాల తక్కువ అనిపిస్తాయి. ఇంకా నాటికలు: పచ్చతోరణం, కవి వారాలు, దిష్టికళ్ళు అన్న నాటికలు ఆకాశవాణిలో ప్రసారాలైనవి. నాకు అన్నిట్లోకి ఈరచన "నీవు నీవుగానే వుండు" అన్నది నచ్చింది. నేను ఏ కథ వ్రాసినా హృదయస్పందన కలిగినప్పుడే వ్రాస్తాను. అప్పుడే ఆ కథ బాగుంటుందని నా నమ్మకం. ఈ కథ యువతీ యువకులకు సంబంధించిన కథ. నా కథలకి ప్రోత్సాహమిచ్చినవారు న్యాయపతి కామేశ్వరమ్మ అక్కయ్యగారు. సంగీతం, కవిత్వం అంటే చాలా ఇష్టం. కొన్ని గేయాలు వ్రాసాను. కొన్ని రేడియోలో వచ్చినవి. శ్రీవారు సహృదయులు నా పేరులోనే వున్నారు కద.

## నీవు నీవుగానే వుండు

ఆఫీసునుంచి వచ్చిన మూర్తికి నవల చదువుకుంటూ కూర్చున్న సుబ్బలక్ష్మిని చూసేసరికి అంతకుముందున్న ఉత్సాహమంతా నీరుగారిపోయింది. తను

ఉదయం వెడుతూ చెప్పాడు, తను వచ్చేసరికి ప్రయాణానికి కావలసినవన్నీ సర్ది వుంచమని. చెప్పినా ఇంకా తాపీగా కూర్చుంది. ఏ పనీ మొదలుపెట్టలేదు. జడకూడా వేసుకోలేదు.

"ఏమిటోయ్ ఇంకా అలాగే కూర్చున్నావ్. తొందరగా తెములు" అని చేతిలోని పుస్తకం లాగేశాడు మూర్తి.

"ఉండండి! ఈ పేజీ ఒక్కటి చదివి తీసేస్తాను" అని అన్నది సుబ్బులక్ష్మి.

"మనం ఇట్లాగే వుంటాము వాళ్లు స్టేషన్‌కి వచ్చేస్తారు. కానీ తొందరగా. నీకు ఎన్నిసార్లు చెప్పినా తెలియదు. శోభని చూసి చురుకుగా ఉండటం నేర్చుకో," అన్నాడు మోహనమూర్తి.

మోహనమూర్తికి తొందర ఎక్కువ. హడావుడి మనిషి. ఏ పని చేసినా నిముషంలో చేస్తాడు. ఎక్కడికైనా వెళ్ళాలంటే చిటికెలో తయారవుతాడు. అందుకు పూర్తిగా విరుద్ధం సుబ్బులక్ష్మి. ఏ పనీ తెములుచుకోదు. తగని శుభ్రం. అన్ని పనులు యధావిధిగా నిదానంగా చేస్తుంది మూర్తి ప్రతి పనీ శోభతో వంతు పెడుతుంటాడు.

జగన్నాధరావు, మోహనమూర్తి ఒకే కాలేజీలో చదువుకున్నారు. ఒకే వూళ్ళో ఉద్యోగం. ఇద్దరూ అరమరికలు లేకుండా, ఎంతో స్నేహంగా వున్నారు. నాలుగురోజులు సెలవుపెట్టి హైదరాబాద్‌లో హోటల్లో రూమ్ తీసుకుని వుండాలని, నెహ్రూ పార్కు, సాలార్‌జంగ్ మ్యూజియం, నౌబత్ పహాడ్, బిర్లా మందిరం, గోల్కొండ అన్నీ చూడాలని ప్రోగ్రాం వేసుకున్నారు. నాలుగు రోజుల్లో సరదాగా హైదరాబాద్ చూసి తిరిగిరావాలనుకున్నారు.

స్టీలు మరచెంబు, టాయిలెట్ పెట్టె, తన బట్టలకి ఒక పెట్టె, మూర్తి బట్టలకి వేరే ఇంకొక పెట్టె అని చాలా సామాను తయారుచేసింది సుబ్బులక్ష్మి.

ఆ సామానంతా చూసి విసుక్కున్నాడు మూర్తి. "ఇవన్నీ ఎందుకూ? ఇంత సామానా మనిద్దరికీ!" అని మూర్తి అవన్నీ తీసేసి, ముఖ్యంగా కావలసినవి ఇద్దరి బట్టలు ఒక సూట్‌కేసులోకి సర్దాడు. సుబ్బులక్ష్మి ఒక డజను చీరలు పైన వేసింది. అవన్నీ తగ్గించాడు. సుబ్బులక్ష్మి కూనిరాగం తీసుకుంటూ అద్దంలో చూసుకుంటూ, తల దువ్వుకోవటం చూశాడు. ఏ మాత్రం తొందరలేని సుబ్బులక్ష్మిని చూసేసరికి, మింగెయ్యాలన్నంత కోపంవచ్చింది మూర్తికి. "ఇంకా జడవేసుకోవటం పూర్తి కాలేదా? అంతసేపా జడవేసుకోవటం! ఇలా రా! నేను నిముషంలో వేస్తాను", అని మూర్తి సుబ్బులక్ష్మి చేతిలో దువ్వెన తీసుకుని, ఒక

సారి అడ్డదిడ్డంగా దువ్వి చిక్కులతోటే జడ అల్లేశాడు. సుబ్బలక్ష్మి ఆ జడ ముందేసుకుని నవ్వుతూ, "ఇలాగే రమ్మంటారా?" అన్నది. "శోభ జడ ఇలావేసుకున్నారేమని అడిగితే మీరు వేశారని చెప్పనా?" అన్నది సుబ్బలక్ష్మి. మళ్ళా జడ అల్లుకుని కనకాంబరాలదండల జడలో పెట్టుకుంది. లేత నీలంరంగు చీర, జాకెట్టు వేసుకుని ముచ్చటగా తయారైంది. మొత్తంమీద ఎలాగైతేనేం మూర్తి హడావుడితో ఇద్దరూ తయారై స్టేషన్‌కి వెళ్ళేసరికి అప్పటికే శోభ, జగన్నాధరావు వీళ్ళకోసం ఎదురుచూస్తున్నారు.


"మీరు మా కంటె ముందే వచ్చేశారే!" అన్నాడు మూర్తి శోభవంక చూస్తూ.

"ఎవరు ముందు వచ్చినా వెనక వచ్చినా ట్రయిన్ రావాలిగా!" అన్నాడు జగన్నాధరావు. ఆ మాట సుబ్బలక్ష్మికి ఎంతో నచ్చింది.

"నేను తొందర చెయ్యకపోతే తెమిలేవారే కాదు," అన్నది శోభ భర్తని ఉద్దేశించి.

ఎరుపురంగు ఫారెన్ నైలెక్సు చీర, అదేరంగు జాకెట్టు, ఎర్ర గాజులు, ఎర్ర రంగు గులాబిపువ్వు, అన్నీ మాచ్ చేసుకుంది శోభ. సన్నగా, నాజూకుగా, చురుకుగా, సోగకళ్ళతో, నవ్వుతూ తుళ్ళుతూ ఆకర్షణీయంగా వుంటుంది. దానికి తగ్గట్లు చలాకీతనం, మాటకారితనం. అందరినీ తనవైపు చూసేట్లు చేస్తుంది శోభ.

శోభని చూస్తూ ఆమె అలంకరణ చాలా బావుందనుకున్నాడు మోహన మూర్తి. అసలు శోభ ఏం చేసినా బావున్నట్లు కనపడుతుంది మూర్తికి. ఎప్పుడూ తన భార్యకీ తనకీ తేడా గమనిస్తుంటాడు మూర్తి. శోభని ఎప్పుడూ మెచ్చుకుంటుంటాడు. జగన్నాధరావు స్వభావం శోభకి పూర్తిగా విరుద్ధం. నిదానంగా పెద్దమనిషి తరహాగా వుంటాడు. సరళ స్వభావం. ఇంట్లో అన్ని విషయాలు శోభ చూసుకుంటుంది. ఆఫీసుకు వెళ్ళటం తన పనేమో తను చూసుకోవటం, తీరుబడిగా వుంటే పేపరు చూసుకోవటం, పుస్తకాలు చదవటం చేస్తుంటాడు. ముక్కుకి సూటిగాపోయే తత్వం. ఇంటి విషయాలేవీ పట్టించుకోడు. ఒకవేళ అతను ఏదైనా చెయ్యబోతే అది బాగాలేదని శోభ కొట్టిపారేస్తుంటుంది. శోభ ఎప్పుడూ జగన్నాధరావు మీద విరుచుకు పడుతుంటుంది ఇంటి పనుల్లో మూర్తి సుబ్బలక్ష్మికి సహాయపడినట్లు తనకేమీ సహాయం చెయ్యడని సాధిస్తుంటుంది. ఒకసారి సుబ్బలక్ష్మి




వాళ్ళింటికి తను వెళ్ళేసరికి మూర్తి, సుబ్బలక్ష్మి వంటఇంట్లో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరూ వంటచేస్తున్నారు. మూర్తి అన్ని పనుల్లోను సహాయం చేస్తున్నాడు. జగన్నాథరావు వంటఇంటి గడపలకి పోడు. ఇంటి పనులు చేతకావు కూడా.

లోకంలో దంపతులు తమాషాగా తటపడుతుంటారు. పొట్టివాళ్ళకు పొడుగువాళ్ళు, నల్లటివాళ్ళకు తెల్లటివాళ్ళు, నిదానస్థులకి తొందరపాటువాళ్ళు, లావాటివాళ్ళకి సన్నటివాళ్ళు, ఇలా తారసపడుతుంటారు. కొంతమంది దంపతులు ఈడూజోడూ సరిపోయినట్లు కనబడుతుంటారు. పైకి ఈడూ జోడూగా కనపడి లాభంలేదు. వాళ్ళ మనస్సుల్లో ఈడూజోడూ కావాలి. అప్పుడే ఆ దాంపత్యం అన్యోన్యంగా వుంటుంది.

వాళ్ళు సరదాగా మాట్లాడుకుంటుండగానే ట్రైన్ వచ్చింది. హడావుడిగా సూట్‌కేస్ చేతితో పట్టుకుని మూర్తి ఎక్కేశాడు. వెనకాలే శోభ తొందరగా ట్రైన్ ఎక్కింది. ఆ తరువాత మెల్లిగా జగన్నాథరావు, ఆవరికి సుబ్బలక్ష్మి ఎక్కారు. ఇద్దరూ యువ జంటలు. సమ వయస్కులు. కబుర్లతో

ప్రయాణం సరదాగా సాగింది. మాటకారులైన శోభ, మోహనమూర్తి ఎక్కువగా మాట్లాడారు. సుబ్బలక్ష్మి, జగన్నాధరావులు శ్రోతలవలె మిగిలారు. సికింద్రాబాద్‌లో దిగారు. ముందు అనుకున్న ప్రకారం బస్సు ఎక్కి హైదరాబాద్ హోటల్లో రూమ్ మూడురోజులకు తీసుకుని సిటీలో అన్నీ చూడాలని నిర్ణయించుకున్నారు. వాళ్ళు చూస్తుండగానే రెండు బస్సులు వెళ్ళిపోయాయి. బస్సులన్నీ చాలా రష్‌గా వున్నాయి. ఆటోలు చేసుకుని వెడదామని అనుకుంటుంటే, వాళ్ళు ఎక్కవలసిన బస్సు రానే వచ్చింది. మూర్తి దబదబా బస్సు ఎక్కేశాడు. వెనకాలే శోభ బాగ్‌తో బస్సులో ఎక్కడమేమిటి, అది కదిలి వెళ్ళిపోయింది. సుబ్బలక్ష్మి, జగన్నాధరావు మిగిలిపోయారు. హుషారైనవాళ్ళు బస్సు ఎక్కి వెళ్ళిపోయారు. నిదానస్తులు మిగిలారు. తెల్లబోయి నిల్చున్న సుబ్బలక్ష్మిని చూస్తూ "ఇప్పుడు ఏంచేద్దామంటావు" అన్నాడు రావు.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను" అన్నది సుబ్బలక్ష్మి.

"ఇంకో బస్సు వచ్చేదాకా చూద్దామా?"

"తీరా బస్సు వచ్చినా అందులో చోటుంటుందో వుండదో!"

"ఆటో తీసుకుని వెడదామా?"

"మీ ఇష్టం. అలాగే వెడదాము. ఎక్కడికని వెడదాము?"

"హైదరాబాద్ అబిడ్‌రోడ్ బస్సుస్టాపు దగ్గర దిగుదాము. వాళ్ళు కూడా అక్కడే దిగుతారు" అన్నాడు జగన్నాధరావు.

"సరే! అలాగే వెడదాము" అన్నది సుబ్బలక్ష్మి.

ఆటోలో ఇద్దరూ ఎక్కారు. అబిడ్ సెంటర్‌లో దిగారు. అక్కడ శోభ, మూర్తి కనపడలేదు. చాలాసేపు నిల్చుని వచ్చేపోయే బస్సుల్ని, జనాన్ని చూశారు. ఏంచెయ్యాలో తోచలేదు. ఆ ప్రాంతాల్లో వున్న రెండు మూడు హోటళ్ళలోకి వెళ్ళి శోభ, మూర్తి కనపడతారేమోనని చూసివచ్చాడు. ఆ జన ప్రవాహంలో ఎక్కడని వెతుకుతాడు! ఎక్కడ కనబడతారు! వాళ్ళు ఎక్కడ దిగారో! వీళ్ళకోసం వాళ్ళు వెతుకుతున్నారేమో! సాయంత్రం ఏడుగంట లయింది. హైదరాబాద్‌లో రాత్రిళ్ళు కూడా పట్టపగల్లే వుంటుంది. చాలా సేపు చూసిచూసి ఇద్దరికీ విసుగుపుట్టింది. నీరసం వచ్చింది. ఎంతసేపని చూస్తారు! ఇక ఇవాల్టికి లాభంలేదు. రేపు వెతకాల్సిందే ననుకున్నారు.

"ముందు రూమ్ తీసుకుని స్నానం, భోజనం అన్నీ చూసుకోవాలి గదా!"

అన్నాడు జగన్నాధరావు. చేసేదేంలేక తలవూపింది సుబ్బలక్ష్మి. ప్రయాణపు బడలిక ఏమీ వలేకపోయినా శోభ, మూర్తి కనబడకపోవడంతో చికాకుగా వున్నది సుబ్బలక్ష్మికి. ఆ ఊళ్ళో చుట్టాలుగాని, స్నేహితులుగాని ఎవ్వరూ లేరు. అక్కడే వున్న లాడ్జికి వెళ్ళి రూమ్ తీసుకున్నారు. సుబ్బలక్ష్మి బట్టలన్నీ మూర్తి దగ్గరవున్న పెట్టెలో వుండిపోయాయి. ఈరోజు ఎలాగో సర్దుకుంటే, రేపు వాళ్ళు కనపడతారేమో ననుకున్నది. సుబ్బలక్ష్మి అన్నిటికి సరేనంటుంది. సర్దుకుని పోతుంది. మెత్తని స్వభావం. ఇదే శోభ అయితే అన్నిటికీ పేచీ పెడుతుంది అనుకున్నాడు మనస్సులో జగన్నాధరావు. నిదానంగా, శాంతంగా వున్న సుబ్బలక్ష్మిని చూస్తే అభిమానం కలిగింది జగన్నాధరావుకి. ఇద్దరూ తొందరపెట్టేవాళ్ళు ప్రక్కన లేకపోవటంవల్ల తమ పనులు మెల్లగా కానిచ్చుకున్నారు. హోటల్లో భోజనంచేసి శోభా, మూర్తి ఎక్కడ వున్నారోనని తలుచుకుంటూ నిద్రపోయారు.

ఉదయం ఏడుగంటలయినా నిద్రలేవలేదు ఇద్దరూ.

"మీరు కూడా ఆలస్యంగా లేస్తారా!" అన్నాడు.

"అవునండీ. నేను లేచేసరికి మావారు కాఫీ తాగేసి నాకు కూడా కలిపి వుంచుతారు" అన్నది.

"నన్ను మా శోభ లేపుతుంది రోజూ" అన్నాడు రావు.

"మనం స్నానాలు, టిఫిన్ చేసి వాళ్ళకోసం వెతకటానికి వెడదాము" అన్నాడు రావు. ఇద్దరూ నిదానంగా తెమిలేసరికి తొమ్మిది గంటలయింది. హైద్రాబాద్ మహానగరంలో ఎక్కడని వెతుకుతారు! ఒక నిర్ణయం లేకుండా, అలసిపోయేదాకా ఇద్దరూ తిరిగివచ్చారు. మళ్ళీ రూమ్‌కి వచ్చి, భోజనంచేసి మళ్ళీ సాయంత్రం బయలుదేరారు. సుబ్బలక్ష్మి రెండు చీరలు, జాకెట్లు తీసుకున్నది. రావు డబ్బు ఇచ్చాడు. పబ్లిక్ గార్డెన్, జూ అన్నీ తిరిగారు. ఎక్కడా వాళ్ళ జాడలేదు. విసుగుపుట్టింది రావుకి. పరాయి మగాడితో ఇలా తిరగటం సుబ్బలక్ష్మికి ఇబ్బందిగా వున్నప్పటికీ వేరే చేసేదేమీలేక, అతను ఆమెపట్ల చూపే మర్యాదవల్ల, అతని పెద్దమనిషి తరహావల్ల రావుతో అన్ని చోట్లకి తిరగగల్గింది. ఆ సాయంత్రం తిరిగివచ్చిన తరువాత సుబ్బలక్ష్మికి బెంగగా అనిపించి అంతా అగమ్యగోచరంగా తోచింది. జగన్నాధరావుకి కూడా ఏదో లోటుగా అనిపించసాగింది. ఇద్దరికీ ఎక్కువగా మాట్లాడే అలవాటు లేదు. సుబ్బలక్ష్మికి ఒక నవల, తనకోసం కొన్ని మాగ్‌జైన్స్ తెచ్చు

కున్నాడు. ఆరోజు రాత్రి పుస్తకాలు చదువుకుంటూ కాలక్షేపం చేశారు. ప్రక్కన సందడిచేస్తూ తమని విసిగించేవాళ్ళు లేకపోయేసరికి ఎంతో వెలితిగా అనిపించింది ఇద్దరికీ. వాళ్ళు వచ్చేదాకా ఎలాగో గడిపి, అనుకున్న ప్రకారం మూడు రోజులు పోగానే స్టేషన్‌కి వెళ్ళటమేనని నిశ్చయం చేసుకున్నారు.

* * *

శోభ, మూర్తి హడావుడిగా బస్సుఎక్కి అబిడ్ బస్‌స్టాపులో దిగారు. సుబ్బలక్ష్మి, రావు తమ మోస్తరుగా తొందరగా బస్సు ఎక్కలేకపోయినందుకు విసుక్కుంటూ ఒకటి రెండు బస్సులు చూశారు. ఆటోలోగాని టాక్సీలోగాని వస్తారేమోనని ఒక అరగంట ఎదురుచూశారు. వాళ్ళకి ఒక్కొక్క గంట ఎన్నో గంటలు ఎదురుచూసినట్లనిపించింది. విసుగుపుట్టింది. ఇద్దరికీ సహనం తక్కువే. రావు సుబ్బలక్ష్మి దిక్కులు చూస్తూ ఎక్కడున్నారో అనుకున్నారు. ఇద్దరి అభిప్రాయాలు ఒకటే. దగ్గరలోవున్న హోటల్లో కాఫీతాగి వెళ్దామని వెళ్ళారు. శోభ, మూర్తి హోటల్లో వున్న సమయంలో, సుబ్బలక్ష్మి, రావు బస్సుస్టాపు దగ్గర వుండటం, వాళ్ళు హోటల్‌కివెళ్ళిన సమయంలో వీళ్ళు బైటికి రావటంవల్ల ఎవరికివారిది అయింది. ఆ పూటకి హోటల్‌లో రూము తీసుకుని మర్నాడు వెతకాలని నిశ్చయంచేసుకున్నారు.

శోభ మూర్తి నిముషంలో స్నానంచేసి తయారయ్యారు. ఏం చెయ్యాలో తోచలేదు. ఆరెంజ్ కలర్ సన్నని కుట్టుపూలచీర, అదే కలర్ జాకెట్టు వేసుకుంది. జడ ఒద్దిగా అల్లి వదిలేసింది. దోసగింజలాగ తిలకం దిద్దింది. సోగ కళ్ళకి మరింత సోగతేలేటట్లు కాటుకరేఖలు తీర్చింది. తన సూట్‌కేస్ వేరే సర్దుకుంది కనుక సరిపోయింది అనుకున్నది.

"శోభ కనుక ఇంత తొందరగా తయారయ్యారు. మా లక్ష్మి అయితే గంటసేపు చేస్తుంది" అని మెచ్చుకున్నాడు మూర్తి. "మావారు కూడా అంతేనండీ! నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకోబోయే వరకు వారి పనులు కూడా నేను చెయ్యవలసిందే" అన్నది శోభ. "మిమ్మల్ని చూస్తే ముచ్చట వేస్తుంది. మీ పనులు, ఆఫీసు పనులు చేసుకోవటమేకాక, మీ శ్రీమతికి కూడా ఇంటి-పనుల్లో సహాయం చేస్తుంటారు" అని అన్నది శోభ అతనివైపు ప్రశంసగా చూస్తూ. ఆమె చూపులకు కదిలాడు మూర్తి క్రాపు సవరించుకుంటూ.

మగవాళ్ళ పనులను ఆడవాళ్ళు మెచ్చుకుంటే, మగవాళ్ళకి గర్వంగా

వుంటుంది ఆడవాళ్ళ అందాన్ని మగవాళ్ళు పొగిడితే, ఆడవాళ్ళకి గర్వంగా వుంటుంది. అది లోక సహజం.

"ఇప్పుడు ఏం చేద్దామంటారు? పిక్చరుకి పోదామా? సెకండ్ షోకి" అంది శోభ

"ఇంగ్లీషు పిక్చరుకు పోదామా?" అడిగాడు మూర్తి

"నేనూ అదే అనబోతున్నాను. నా మనస్సులో మాట మీరన్నారు. మావారు సెకండ్ షోకి వద్దంటారు ఎప్పుడూ. నాకేం అభ్యంతరం లేదు," అన్నది శోభ

"నాకు కూడా ఇంగ్లీషు పిక్చర్లు చూడటం ఇష్టమే ఎప్పుడూ తెలుగు పిక్చర్లు చూస్తుంటాము కదా! వెరైటీ ఉండాలి లైఫ్‌లో" అన్నది."

"మా సుబ్బలక్ష్మి ఇంగ్లీషు పిక్చర్‌కి రానంటుంది ఎప్పుడూ తెలుగు పిక్చర్లు చూద్దామంటుంది" అన్నాడు మూర్తి హుషారుగా రూమ్ తాళం వేస్తూ.

హాల్లో జనం అట్టే లేరు. ఇద్దరికీ చాలా హుషారుగా వుంది మూర్తి ఇదివరలో చాలాసార్లు మనస్సులో అనుకున్నాడు, శోభ లాంటి అమ్మాయి తన భార్య అయితే ఎంత బాగుండేదని. అనుకోకుండా వచ్చిన ఈ అవకాశాన్ని జారవిడుచుకోకుండా సరదాగా గడపాలనుకున్నాడు. సినిమాహాల్లో ఆమె పైటచెంగు ఫ్యాన్ గాలికి అతనికి మెత్తగా తగిలి గిలిగింతలు పెట్టినట్లు అయింది. శోభ కొద్ది ఒదిగి కూర్చున్నా, మధ్య కుర్చీమీద ఒకళ్ళ చేతిమీద ఒకళ్ళు అప్రయత్నంగా వెయ్యటం, సారీ అనుకోవటం జరిగింది. అసలు పిక్చర్ చూస్తున్న ధ్యాసే లేదు. రూమ్‌కి వచ్చిన తరువాత పిక్చర్‌కు వెళ్ళటం బాగుందనుకున్నారు. ఆరోజు రాత్రి మంచంమీద పడుకుని శోభ పరాయి మగాడితో హోటల్ రూమ్‌లో వుండటం బాగాలేదని అనుకున్నా, కాదనుకుని ఇలా వుండ[illegible]లేదు కదా! సుబ్బలక్ష్మి, తన భర్త తొందరగా బస్సు ఎక్కలేక పోవటంవల్ల, ఇలా వుండాల్సివచ్చిందని సరిపెట్టుకుంది. వేళ అయ్యాక కలిగింది కూడా ఏమిటో ఏవో ఆలోచనలతో నిద్రపట్టలేదు శోభకి.

మూర్తికి కూడా నిద్రపట్టక మసులుతూనే వున్నాడు. నిద్రవేళ తప్పి కొత్త చోటు, అన్నీ కలిసివచ్చినవి అనుకున్నాడు మూర్తి. డబల్ రూమ్ కనుక విశాలంగానే వున్న మంచాలు దూరంగా జరుపుకున్నారు. రూమ్ అన్నిటికీ వసతిగా వున్నది. శోభ నిద్రపోతున్నదో లేదోనని కళ్ళుతెరిచి చూసాడు మూర్తి.

అదే సమయానికి కళ్ళువిప్పి చూసింది మూర్తివైపు. చూపులు ఢీ కొట్టుకున్నట్లు కలిశాయి.

"మీరూ నిద్రపోలేదా." అన్నాడు.

"కొత్త చోటు కదండీ! వీళ్ళు ఎక్కడ వున్నారో, ఏంచేస్తున్నారో, రేపైనా కనబడతారో లేదో" అన్నది శోభ,

"ఇలాంటి సంఘటనలు జరిగితేనే గాని వాళ్ళకు బుద్ధిరావటం రాదులెండి!" అన్నాడు మూర్తి.

మూర్తికి వాళ్ళను ఈ సమయంలో తలుచుకోవటం ఇష్టంగా లేదు. వాళ్ళు ఈ రెండు రోజులు కనబడకుండావుంటేనే బాగుండుననుకున్నాడు మనసులో.

ఆ మరునాడు తెల్లవారుజామునే లేచాడు. అప్పటికే శోభ లేచి మొహం కడుక్కుంటోంది. మూర్తికి శోభ పనులు అయేదాకా ఆగవలసివచ్చింది. తెల్లవారేసరికి కాలకృత్యాలు తీర్చుకుని తయారయ్యారు. తాజ్‌మహల్ హోటల్‌కివెళ్ళి కాఫీ టిఫిన్ తీసుకున్నారు. ప్రక్కన జగన్నాధరావు, సుబ్బలక్ష్మి వుంటే వాళ్ళ కోసం ఆగటంతో వీళ్ళకు సరిపోయేది. ఇప్పుడు ఇద్దరూ తొందర స్వభావం కలవాళ్ళు కావటంచేత, ఇద్దరికీ కావలసినంత టైమ్ కనపడుతోంది. ఊరు చూడటానికి బయలుదేరారు. సాయంత్రందాకా చూడవలసిన ప్రదేశాలు కొన్ని చూశారు. మూర్తి సరదాగా బాగానే ఖర్చుపెట్టాడు. ఇద్దరూ ఆ సాయంత్రం మళ్ళీ పిక్చరుకు వెళ్ళారు. అది హిందీ పిక్చరు. ఇంటర్వెల్లో మూర్తి లేచాడు. అతని జేబురుమాలు క్రిందపడింది. శోభ అది ఇవ్వటానికి వంగింది. అతనూ అదే సమయానికి అది తీసుకోవటానికి వంగటంలో, ఇద్దరూ దగ్గరకు రావటం, శోభచెయ్యి అతనికి తగలటం, 'సారి' అనటం జరిగింది. శోభ కొంచెం సిగ్గుపడింది. బైటకువెళ్ళి చిప్సు తీసుకునివచ్చాడు. ఇద్దరూ తిన్నారు. రూమ్‌కి వచ్చిన తరువాత, వాష్‌బేసిన్ దగ్గరకు చెయ్యికడుక్కోడానికి వచ్చింది శోభ. మూర్తి కూడా చెయ్యి కడుక్కోవాలని వచ్చాడు. మూర్తి చిరునవ్వు నవ్వాడు. శోభ కూడా సమాధానంగా అప్రయత్నంగా దరహాసంచేసింది. ఆ రెండు రోజులనుంచి ఇద్దరూ చాలా స్నేహితంగా తిరిగారు. మూర్తి కొంచెం అతిచనువు తీసుకుంటున్నాడని గ్రహించింది శోభ. పడుకున్న దన్నమాటే గాని మనస్సుకి శాంతిలేకుండా వుంది. ఇలా పరాయి మగాడితో ఒక రూమ్‌లో వుండవలసి రావటం తప్పని పరిస్థితే అయినా, తనుకూడా అతని చనువును అటంకపరచలేదు. తన తొందరపాటువల్లకదా ఈ విచిత్రసంఘటన జరిగింది! మూర్తి ఇంకా ఎక్కువ చనువు తీసుకుంటే ఆమె ఇంక ఆలోచించలేకపోయింది. ఆలోచన వచ్చినదానికే




ముచ్చెమటలుపోసాయి. అమ్మో! ఇంకేమైనా వున్నాదా? అలా జరగకూడదు, శోభకి తన భర్త గుర్తువచ్చాడు. అతని ప్రక్కన తను ఎంతో నిశ్చింతగా నిద్రపోయేది. రేపటినుంచి మూర్తితో చనువుగా వుండకూడదు జాగ్రత్తగా వుండాలనుకుంది

మూర్తికూడా నిద్రపట్టక అటు ఇటు దొర్లుతూనే వున్నాడు. శోభ ఆరోజు తనను చూసి నవ్విన నవ్వు తనకి ఎంత పరవశం కలిగించింది! శోభ! అసలు ఆ పేరు ఎంత బాగుంది. శోభలాగే ఆ పేరు కూడా అందంగా వుంది. తలగడ సరిచేసుకుని శోభ తలంపుతో ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు.

శోభ తనమాటలకి కిలకిలా నవ్వుతోంది. పైట జారినా ఆ సంగతికూడా గమనించలేదు. మూర్తి శోభని అమాంతం ఎత్తుకుని మెల్లిగా చెట్లవైపుకి వెడుతున్నాడు. ఇంతలో అక్కడ సిమెంటు బెంచీమీద కూర్చున్న ఒక యువతీయువకులజంట కనపడింది. ఇంకా దగ్గరగా వచ్చేసరికి లక్ష్మీ జగన్నాధరావులు

"మీరు ఇక్కడ వున్నారా? మీ కోసం వెతుకుతున్నాము" అంటూ వచ్చి లక్ష్మి మూర్తి దగ్గరకు వస్తున్నది.

"సుబ్బలక్ష్మీ!" అన్నాడు మూర్తి చేతులు వదిలేస్తూ కంగారుగా. శోభ క్రిందపడిపోయింది. పెద్ద చప్పుడైంది. మంచం దగ్గరగా స్టూలు మీదవున్న గ్లాసు మూర్తి చెయ్యితగిలి క్రిందపడిపోయి ముక్కలైంది మూర్తి కళ్ళుతెరిచి చూశాడు. తను మంచంమీదనే వున్నాడు. శోభ మంచంమీద శోభ వున్నది. చప్పుడుకి శోభ లేచి "కల ఏమైనా వచ్చిందా? కలవరిస్తున్నారు" అని అన్నది.

"అవును. ఏమిటో వెధకల! వీళ్ళు ఎక్కడ వున్నారో" అన్నాడు. ఇంటి నుంచి బయలుదేరాక మొదటిసారిగా మనసారా సుబ్బలక్ష్మిని తలచుకున్నాడు మూర్తి.

"వాళ్ళు రేపు కనపడినా కనపడకపోయినా, మనం రేపు సాయంత్రం ప్రయాణమే కదా! వాళ్ళుకూడా అనుకున్నప్రకారం స్టేషన్‌కి వస్తారు. మనలాగే రూమ్ తీసుకుని వుండివుంటారు" అన్నది శోభ.

తనకు వెంటతలంపు కలిగినందుకు చికాకుపడ్డాడు మూర్తి. శోభతో రేపటి నుంచి జాగ్రత్తగా వుండాలనుకున్నాడు. తెల్లవారుఝామున అయిదుగంటలకల్లా ఇద్దరూ ఒకేసారి లేచారు స్నానంచెయ్యడానికి, ముఖం కడుక్కోవటానికి, ఒకళ్ళని ఒకళ్ళు అడ్డంవచ్చినట్లుగ అనుకున్నారు. ఆరోజు మూర్తికి శోభ అన్ని పనుల కష్టంవచ్చినట్లనిపించింది. మూర్తి స్నానంచేసి వచ్చేలోపల బాయ్ చేత కాఫీలు తెప్పించింది శోభ ప్రయాణానికి అంత తొందర ఏమిటో ననిపించింది. అతనికి సుబ్బలక్ష్మి గుర్తుకురావటం మొదలుపెట్టింది

ఇద్దరూ షాపింగ్‌కి బయలుదేరారు. మూర్తి వచ్చేలోపలే రూమ్‌లోంచి బైటికి వచ్చేసింది. శోభ బస్సు ఎక్కడంలో, ఇద్దరూ ఒకేసారి ఎక్కడబోయి, ఒకేసారి మళ్ళీ దిగి అలా రెండుసార్లు దిగి, అలా రెండుసార్లయిన తరువాత, బస్సు కదులుతుండగా, ఇద్దరూ ఒకేసారి ఎక్కి ఒకళ్ళ నొకళ్ళు తగిలి తూలి ముందుకు పడబోయి పడ్డుకున్నారు. మూర్తి కళ్ళే తొందర మనిషి అని అనుకున్నది శోభ. అమెకి కూడా మూర్తి మీదే విసుగ్గా వుంది

మూర్తికి ఎక్కడైనా సుబ్బలక్ష్మి జగన్నాధరావు కనపడితే బాగుండునని ప్రతి ఆడవాళ్ళని సుబ్బలక్ష్మేమోనని పరిశీలించి చూడటం మొదలుపెట్టాడు. ఫాన్సీ షాపులో ఏవో కొంటున్నది శోభ. ఇంకా చాలామంది ఆడవాళ్ళు వచ్చారు. అదిగో! నీలంచీర, సుబ్బలక్ష్మి! సందేహం లేదు. మూర్తి దబదబా ముందుకు వెళ్ళి సుబ్బలక్ష్మి అని భుజంమీద చెయ్యి వేశాడు. ఆ అమ్మాయి వెనక్కి తిరిగి చూసింది.

నిత్తరపోయి చూస్తున్న మూర్తివంక చూస్తూ, "ఏం మిస్టర్!" కళ్ళు పెద్దవిచేసి పోట్లాగటానికి తయారైంది.

"పొరబాటైంది. క్షమించండి! మావాళ్ళు అనుకున్నాను" అన్నాడు మూర్తి సగం తగ్గిపోయి.

"ఎవరైంది అంతమాత్రం చూసుకోవద్దా! జాగ్రత్తగా వుండండి!" అని హెచ్చరించి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. జరిగిన పొరబాటుకు దిగాలుగా చూస్తూ నిల్చుండిపోయాడు నోటమాటరాక మూర్తి.

"ఏమిటండీ! సరిగా చూసుకోకుండా అంత తొందరపడ్డారు" అన్నది శోభ. చాలా అభిమానపట్టాడు మూర్తి ఏం మనిషో మావారు అయితే ఎప్పుడూ అలా చెయ్యరు అని మనస్సులో అనుకున్నది శోభ. మొన్నటిదాకా మూర్తి ఏ పని చేసినా బాగున్నదనుకున్న శోభకి ఈ రెండు రోజులతో మొహం మొత్తింది.

సాయంత్రం హోటల్ రూమ్ ఖాళీచేసి ట్రైన్‌కి రెండు గంటల ముందు గానే స్టేషన్‌కి వచ్చారు ట్రైన్ రావటానికి పది నిముషాలు వుండనగా, సుబ్బ లక్ష్మి, జగన్నాథరావు మెల్లిగా వచ్చారు. "వచ్చారా!" అంటూ మూర్తి, శోభ సంతోషంగా వాళ్ళ దగ్గరకు వెళ్ళా . సుబ్బలక్ష్మి భుజం మీద చెయ్యి వేసి కౌగలించుకున్నంత దగ్గరకు తీసుకున్నాడు మూర్తి, ఎక్కడున్నదీ మరిచిపోయి. ఇంతలో ట్రైన్ వచ్చింది. ఈ సారి మళ్ళా దుడదుడా ఎక్కకుండా, సుబ్బ లక్ష్మిని ముందు ఎక్కించి తరువాత తను ఎక్కాడు మూర్తి. జగన్నాథరావు వెనకాలే శోభ ఎక్కింది శోభ ఇంటికి చేరేదాకా జగన్నాథరావుతో కబుర్లు చెబుతూనేవున్నది. మూర్తి తన కబుర్లతో హోరెత్తించేశాడు సుబ్బలక్ష్మిని

ఆరోజు రాత్రి ఎండలో నడిచి అలసిపోయిన బాటసారి చెట్టునీడలో సేద దీర్చుకున్నట్లు, శోభ జగన్నాథరావు బుజ మీద తలపెట్టుకుని నిశ్చింతగా నిద్ర పోయింది.

మూర్తి తన తొందర స్వభావానికి సుబ్బలక్ష్మి నిదానమైన స్వభావానికి సరిపోయిందని తెలుసుకున్నాడు

ఆమె చూపులు వెన్నెల ప్రసరించినట్లు చల్లగా వున్నవని, ఆమె నిదాన మైన స్వభావం గులాబీపరిమళంలాగా వున్నదనీ, ఆమె చెవిలో ఎన్నో కవనాలు చెప్పాడు. "సుబ్బలక్ష్మీ! నీవు నీవుగానే వుండు! శోభలాగా వుండవద్దు" అని అంటూ ఆమెని తనలో దాచుకున్నాడు మూర్తి.